ప్రణాళికతో ఫలితం 'పది'లం

- పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు
- ప్రత్యేక ప్రణాళికతో నైట్ విజన్ తదితర కార్యక్రమాలు
- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


నైట్ విజన్‌లో భాగంగా పెద్దపాడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ డా.వి రంగారెడ్డి(ఫైల్)

కర్నూలు సిటీ: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. అధికారులు ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. నైట్ విజన్ కార్యక్రమం పేరుతో పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రుల్లో కూడా బాధ్యత పెంచుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లతోపాటు జిల్లాలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు నిపుణుల చేత ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ) పరీక్షల నుంచి రీవిజన్ టెస్ట్‌లలో వచ్చిన ఫలితాలను బట్టి చూస్తుంటే ఈ సారి వందశాతం ఉత్తీర్ణత వచ్చేలా స్పష్టంగా కనబడుతుంది. ఈ నెల 7వ తేదీతో నాల్గవ రీవిజన్ టెస్ట్ పూర్తి అవుతుంది. ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది గతంలో కంటే భిన్నంగా జనవరి నాటికి దాదాపు అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేశారు.

పరీక్షలకు 9,526 మంది :

నైట్ విజన్ కార్యక్రమం పేరుతో విద్యాశాఖ అధికారులు రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్తున్నారు. పిల్లల సామర్థ్యాలపై తల్లిదండ్రులతో చర్చించి వారు చదువుకునేలా వాతావరణం కల్పిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్ష నిర్వహించిన తరువాత అందులో వచ్చిన ఫలితాల ఆధారంగా అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి ఏ,బీ,సీ,డీ గ్రేడ్‌లుగా విభజించారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఫార్మేటివ్-2 పరీక్షల నాటికి వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతోపాటు ఏ రోజుకు ఆ రోజు స్లిప్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. స్లిప్ టెస్ట్‌లలో వచ్చిన ఫలితాల ఆధారంగా మార్కులు తక్కువ వచ్చిన పిల్లలకు ప్రత్యేకంగా పునరుశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ చేపట్టిన చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 22,791 మంది ఉన్నారు. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు 9,526 మంది పరీక్షలు రాయనున్నారు. ఫలితాల పెంపులో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డీఈఓలను భాగస్వాములుగా చేశారు.

పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచేలా చర్యలు

పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు వేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు రెగ్యులర్ పర్యవేక్షణతో పాటు, రాత్రి వేళల్లో పిల్లల ఇళ్లకు వెళ్లి వారిలో ఆత్మస్థైర్యం పెంచేలా తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి. ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2, రీవిజన్ టెస్ట్‌ల ఫలితాలను బట్టి చూస్తే ఉత్తీర్ణత శాతం అంచనాలకు తగ్గట్లు వస్తున్నాయి. ప్రస్తుతం నాల్గోవ రీవిజన్ టెస్ట్ చివరి దశకు చేరుకుంది. ప్రీఫైనల్ పరీక్షలు సైతం నిర్వహించేందుకు షెడ్యూల్ జారీ చేశాం.

– డా.వెంకట రంగారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

సమాజంలో మహిళలను గౌరవించాలి


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎర్రబురుజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, విద్య, వైద్య, వ్యాపారాలు, క్రీడలు, రాజకీయాలు, అంతరిక్షం, టెక్నాలజీతో పాటు ఇంటి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టిందన్నారు. మహిళలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ భావన, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్త కళల ప్రదర్శన ప్రారంభం


చేనేత హస్తకళల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎస్‌వీ విజయ మనోహరి

కర్నూలు (టౌన్): నగరంలోని బి.క్యాంపు విజ్ఞాన మందిరం సమావేశ హాలులో సోమవారం చేనేత హస్త కళల ప్రదర్శన ప్రారంభమైంది. కళాజ్యోతి హ్యాండీక్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన, అమ్మకాలను వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు ఎస్‌వీ విజయ మనోహరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత హస్త కళలకు చేయూత ఇద్దామని పిలుపునిచ్చారు. చీరెలు, కలంకారి వస్తువులు, జ్యూట్ బ్యాగ్స్, హైదరాబాదు ముత్యాలు, కొండపల్లి బొమ్మలు ఎన్నో రకాల వస్తువులు తక్కువ ధరకు అందిస్తున్నట్లు చెప్పారు. సంస్థ నిర్వాహకులు పసుపులేటి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ. ఈ నెల 23వ తేదీ వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులు

కర్నూలు(సెంట్రల్): తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు వెళ్తున్న హైవే 340సీ కోసం భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం భూములు కోల్పోతున్న నూతన పల్లె గ్రామస్తులతో కలసి ఏపీ రైతు సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ రేటకు అనుగుణంగా రైతుల భూములకు ధరలు కేటాయించాలన్నారు. ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. కేవలం రూ.12 లక్షలు మాత్రమే ఎకరాకు ఇస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, వీరేష్, రాముడు, నాగేంద్ర, రామాంజనేయులు, మద్దిలేటి పాల్గొన్నారు.

9న హోలీ వేడుకలు

కర్నూలు కల్చరల్: సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన దక్షిణ షిర్డీగా పేరు గాంచిన సాయిబాబా దేవస్థానంలో హోలీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు భక్త మండలి ప్రధాన కార్యదర్శి మహాబలేష్ తెలిపారు. సాయంత్రం 7 గంటలకు హోలీ రంగుల కార్యక్రమం, హోలిక దహనం, కోలాటం, పల్లకి సేవ కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, బలగం, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : సార్, బలగం, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, బలగం, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వ్యాస్ప్ క్వాంటమేనియా, క్రీడ్-3
భరత్ కాంప్లెక్స్: బిగ్‌స్నేక్‌కింగ్, వాల్తేరు వీరయ్య
రాజ్ : గ్యాంగ్ లీడర్
శ్రీరామ : గ్రంథాలయం
విజయ : వినరో భాగ్యము విష్ణు కథ

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలియజేయండి

- అదనపు ఎన్నికల నిర్వహణ అధికారి, కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం నగరపాలక సంస్థ పరిధిలోని 42వ వార్డులో గుర్తించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలో ఏవైన ఇబ్బందులు, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 7వ తేదీ లోపు కార్యాలయ పనివేళల్లో ఫిర్యాదులు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని అదనపు ఎన్నికల నిర్వహణ అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను నగరపాలక సంస్థ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా కోర్టు, పోస్టాఫీసు, వార్డు సచివాలయాల వద్ద ప్రదర్శించినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని తెలిపారు.

సీఎంను కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే


సీఎం వైఎస్ జగన్‌తో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దంపతులు

కర్నూలు(రాజ్‌విహార్): కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దంపతులు సోమవారం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అభివృద్ధి, పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రం కోడుమూరుకు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. వర్కూరు రోడ్డులో ఉన్న ఇంటర్మీడియట్ కళాశాలకు 10 ఎకరాల స్థలం ఉందని, అందులోనే డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేసుకోవచ్చని సీఎంకు వివరించారు. కోడుమూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే రూ.25కోట్లు మంజూరు చేశారని, ఈ పనులకు వారం రోజుల్లో టెంటర్లు పిలిచే అవకాశం ఉందన్నారు. తద్వారా ప్యాలకుర్తి, వర్కూరు, వెంకటగిరి, పులకుర్తి పక్కల గ్రామాల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

ఎమ్మెల్సీగా రవీంద్రారెడ్డిని గెలిపించాలి


శాసన మండలి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ కోరారు. సోమవారం ఆయన నగరంలోని 4, 5, 6, 17వ వార్డుల్లోని ప్రైవేట్ స్కూళ్లు, ఇళ్లకు వెళ్లి శాసనమండలి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పేదల విద్య, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు అధిక పాధాన్యత ఇస్తున్నారని, ఇందులో భాగంగా అధికారంలోకి వచ్చాక లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసే రవీంద్రారెడ్డిని గెలిపించుకోవలసిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నీలోఫర్, సుజాతమ్మ, అర్షియా ఫర్హీన్, కైప పద్మలత, పార్టీ నాయకులు హకీం, శేషు యాదవ్, రియాజ్ బాబా, సన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి

త్వరలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన 5వ వార్డు రాంబోట్ల దేవాలయం, 6వ వార్డు బేకార్ కట్ట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షాపులు, ఇళ్లకు వెళ్లి రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేయ్యాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థి డి.జె.వీరేష్‌ను అభినందిస్తున్న ఉస్మానియా కళాశాల కరస్పాండెంట్ అజ్రాజావీద్

కర్నూలు (టౌన్): ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు చండీఘడ్ యూనివర్సిటీ మోహాలో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉస్మానియా కళాశాల విద్యార్థి డి.జె. వీరేష్ (బీఏ మొదటి సంవత్సరం) ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థిని సోమవారం కళాశాల కరస్పాండెంట్ అజ్రాజావీద్ తన చాంబర్‌లో అభినందించారు. గత డిసెంబర్ 16వ తేదీ రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న తమ విద్యార్థి ప్రతిభ చాటి ఆల్ ఇండియా పోటీలకు ఎంపికకావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీయుద్దీన్, వ్యాయమా ఉపాధ్యాయులు రఫీక్ అహమ్మద్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో చదివే విద్యార్థులందరికీ ఫీజులతో సంబంధం లేకుండా ఇంటర్ హాల్ టిక్కెట్లు ఇవ్వాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లాఅధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలు ఫీజులు చెల్లించిన వారికే హాల్ టిక్కెట్లు ఇచ్చి మిగతా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లు ఇవ్వాలన్నారు. హాల్ టిక్కెట్లు ఇవ్వని ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ధోని రాజు, మదన్, ఠాగూర్ పాల్గొన్నారు.

9న మున్సిపల్ వేలాలు

గూడూరు: 2023–24 ఆర్థిక సంవత్సరానికి గూడూరులోని పలు మార్కెట్లకు ఈనెల 9న వేలాలు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. వారపు సంత, రోజువిరి కూరగాయల మార్కెట్, గొర్రెలు, పశువుల మాంసపు మార్కెట్ తదితర వాటికి వేలం వేయనున్నట్లు వెల్లడించారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు కర్నూలు క్రీడాకారిణి


జాతీయ పోటీలకు ఎంపికైన సాయిగీతికను సన్మానిస్తున్న స్టేడియం సీఈఓ, వైద్యులు

కర్నూలు(టౌన్): ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం ఎక్తా నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు కర్నూలు నగరానికి చెందిన సాయి గీతిక ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారిణిని సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని తన చాంబర్‌లో సీఈఓ రమణ, వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ శాలువాతో ఘనంగా సత్కరించారు. రూ.5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య మాట్లాడుతూ..ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు శాలి వాహన డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సాయిగీతిక ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ వంశీకృష్ణ, తేజస్విని పాల్గొన్నారు.

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖాదర్ వలి

కర్నూలు(అగ్రికల్చర్): 'సిరిధాన్యాలను నిర్లక్ష్యం చేయవద్దు.. నేడు వీటి ద్వారానే మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని' పద్మశ్రీ అవార్డు గ్రహీత, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. సిరి ధాన్యాల ఆహారం తీసుకుంటే ఆరు నెలల నుంచి 2 ఏళ్లలో వారి వ్యాధులను పూర్తిగా నివారించుకోవడం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ ఖాదర్‌వలికి కేంద్రం పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసిన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాయంత్రం 6 గంటలకు స్కందాన్షి గ్రూపు ఆధ్వర్యంలోని దేశీ న్యూట్రీ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలిని స్కందాన్షి గ్రూపు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరించారు. సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై చేసిన ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రంలో కూడా సిరి ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నెలవారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై షెడ్యూలు ప్రకటించిందని తెలిపారు. సిరిధాన్యాల ద్వారా షుగర్, బీపీ, థైరాయిడ్, ఓబేసిటీ, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్.వరలక్ష్మి, డీసీ్ప సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు ప్రయోజనకరం

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలను సాగు చేయడం ద్వారా పర్యావరణానికి, నేల తల్లికి ప్రయోజనం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెన్సీ లక్ష్మయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో పొదుపు మహిళలతో నిర్వహించిన సమావేశంలో వారు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ కంటే ముందు 30 రకాల నవధాన్య విత్తనాలను ఎకరాకు 13 కిలోలు చొప్పున విత్తుకోవాలన్నారు. ఇందులో పచ్చిరొట్టె , పప్పుధాన్యం, ఆకు కూరలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలకు సంబంధించిన విత్తనాలు ఉండేలా చూసుకోవాలన్నారు. రసాయనాలతో పండించిన పంటలను తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ దిశగా ప్రజలను చైతన్య పరిచి ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులనే వాడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, సీసీలు, సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, మైమున్నీసాబేగం, మాస్టర్ ట్రైనర్స్ మురళీ మోహన్, మార్కెటింగ్ ఇన్‌చార్జి ఎంటీ ఆంజనేయులు, హెచ్‌ఏన్‌ఎంటీలు, ఎంఎస్‌ఓబీలు, వివిధ గ్రామాలకు చెందిన వీఓలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో విదేశీ భక్తుల పూజలు

కర్నూలు కల్చరల్: స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని ఇస్కాన్ జగన్నాథ మందిరంలో సోమవారం విదేశీ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ అమెరికా, రష్యా, నైజీరియా దేశాలకు చెందిన భక్తులు ఆలయాన్ని సందర్శించి జగన్నాథ్, బలదేవ్, సుభద్రలను దర్శించుకున్నారు. హరే కృష్ణ హరే రామ సంకీర్తన చేస్తూ నృత్యాలు చేశారు.

నేడు ఓటు వేసే విధానంపై అవగాహన

కర్నూలు(టౌన్): ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటు వేసే విధానంపై మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాలులో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, శాసన సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొంటారన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం పోరాటం

కర్నూలు(సెంట్రల్): కార్మికుల సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న పేర్కొన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంలోని ఐన్‌టీయూసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ కార్మికుల పక్షపాతి అన్నారు. కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా పోరాటం చేస్తుందన్నారు. ఇక నుంచి ప్రతినెలా మొదటి సోమవారం ఐఎన్‌టీయూసీ జిల్లా సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు.

పోస్టాఫీసు ఏర్పాటుపై నివేదిక ఇవ్వండి

కర్నూలు(రాజ్‌విహార్): అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం తల్లెంవారిపల్లి గ్రామంలో పోస్టాఫీసు ఏర్పాటు చేసేందుకు నివేదిక ఇవ్వాలని కర్నూలు రీజియన్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఎం.జగదీష్‌పాయ్‌ను ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ డాక్టర్ అభినవ్ వలియా ఆదేశించారు. అదే మండలం గడేల గ్రామంలోని బ్రాంచ్ పోస్టాఫీసును తరలించి ఓబులవారిపల్లెలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి విన్నపాలు వచ్చాయని, ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి అధ్యయనం చేసిన నివేదికలు ఇవ్వాలని కోరారు.

ఆర్‌యూ మాజీ ఈసీ మెంబరు మృతి

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్శిటీ మాజీ పాలక మండలి సభ్యులు జీటీ నాయుడు అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈయన ప్రస్తుత ఆర్‌యూ ఎస్‌కే పీజీ సెంటర్‌గా ఉన్న సమయంలో 1981 నుంచి 2008 సంవత్సరం వరకు ఫిజిక్స్ ఆచార్యులుగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఆ తరువాత 2016 నుంచి 2019 వరకు ఆర్‌యూ పాలక మండలి సభ్యులుగా పని చేశారు. వర్సిటీ అధికారులు ఏడీ భవనంలో జీటీ నాయుడు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ వీసీ ఆచార్య ఆకెపోగు వెంకటస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చా, రెక్టార్ ఆచార్య డా.సీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన

కర్నూలు సిటీ: స్థానిక జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అమెరికా దేశంలోని న్యూటానిక్స్‌లో సీనియర్ టెక్నీషియన్ కిరణ్ పాల్గొని ప్రసంగించారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గుగూల్ వంటి సంస్థలు అందించే క్లౌడ్ కంప్యూటింగ్ సేవల గురించి ఆయన వివరించారు. ఈ సదస్సులో కాలేజీ ప్రిన్సిపాల్ డా.సి శ్రీనివాసరావు, సహాయ ఆచార్యులు డి.జయనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

కర్నూలు(సెంట్రల్): సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా, కోడుమూరు డివిజన్ కార్యదర్శిగా, కర్నూలు మండల కార్యదర్శిగా పనిచేసి అశువులు బాసిన సోమన్న ఆశయన సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. సోమవారం సోమన్న ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కార్మిక, కర్షక భవన్‌లో సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ఎంఏ గఫూర్‌తోపాటు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ హాజరై సోమన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమన్న కుటుంబ సభ్యులకు అండగా పార్టీ తరఫున రూ.2.5 లక్షలు అందించారు.

రోగులకు మెరుగైన సేవలు

కోడుమూరు రూరల్: పీహెచ్‌సీల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య ఆదేశించారు. మండలంలోని లద్దగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ తనిఖీ చేసి పీహెచ్‌సీ రికార్డులు, సిబ్బంది పనితీరు, ప్రజలకందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యసిబ్బంది తరచూ పర్యటిస్తూ ఉండాలని, ముఖ్యంగా యుక్తవయస్సు గల బాలికల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి పోషకాహారం, మందులు అందేలా చూడాలన్నారు. అలాగే గర్భిణులు ఆసుపత్రుల్లో సుఖప్రసవం అయ్యేలా చూడాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిదేనన్నారు. అనంతరం మండలంలోని రామాపురంలో ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.నస్రీమ్, సీహెచ్‌ఓ శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, 104 సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రారంభమైన రంగల్‌దర్వేశి తిరునాల

గడివేముల: ఒండుట్ల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీరంగనాయకస్వామి, రంగల్ దర్వేశి ఖాద్రి స్వామివార్ల ఉత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. గని గ్రామంలో రంగనాయక స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామి వారిని ఆలయానికి తీసుకెళ్లారు. అలాగే రంగల్‌దర్వేశి ఖాద్రి స్వామికి గంధం నిర్వహించారు.ఉత్సవాల్లో ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ కత్తి తులసమ్మ, ఆలయ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో ప్రయోజనం

సి.బెళగల్: పంటపొలాల్లో మిత్ర పురుగుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సంద్యపోగు భాస్కర్ అనే రైతుకు చెందిన వేరుశన పంటలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పంటల రక్షణ, అధిక దిగుబడులపై అవగాహన కల్పించారు. పురుగుల గుర్తింపునకు వినియోగించే స్వాప్ నెట్స్‌ను వాడే విధానాన్ని వివరించారు. అలాగే అధిక మొత్తంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడితే లాభం కన్నా నష్టమే ఎక్కువ అని వెల్లడించారు.